www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 18 జనవరి 2025
5
తిరుపతి



ఫ్లెమింగో ఫెస్టివల్ మౌలిక వసతులు పరిశీలన

ప్రజాశక్తి - దొరవారిసత్రం

మూడు రోజుల పాటు జరగనున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌కు విచ్చేసే పర్యాటకులకు భద్రతతో పాటు, మౌలిక వసతులు బాగుండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభం కానుండడంతో శుక్రవారం మండల పరిధిలోని నేలపట్టు పక్షుల కేంద్రంలో పర్యాటకులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం పర్యాటకులను పలకరించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభంబన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, ఆర్డీవో కిరణ్మయి, పర్యాటక శాఖ అధికారి జనార్ధన్‌రెడ్డి, తహశీల్దార్ శైలకుమారి, డిపిఒ సుశీలదేవి పాల్గొన్నారు.



గాఢనిద్రలోనే..



- నలుగురు దుర్మరణం
- 22 మందికి గాయాలు
- వోల్వా బస్సును ఢీకొన్న టిప్పర్
- రూ.25 లక్షలివ్వాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్

అర్ధరాత్రి...అందరూ గాఢనిద్రలో ఉన్నారు.. ఒక్కసారిగా టిప్పర్ వోల్వా బస్సును ఢీకొంది.. ఏం జరిగిందో తెలియక ఆర్తనాదాలు.. నిద్రలోనే నలుగురు దుర్మరణం పాలయ్యారు.. 22 మందికి గాయాలయ్యాయి. టిప్పర్ వేగంగా వచ్చి బస్సును ఢీకొందని ప్రయాణికులు వాపోయారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన ప్రయాణికుల బంధువులు ఉలిక్కిపడేలా చేసింది. వివరాలిలా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు జరుగుతుండటం గమనార్హం.

చిత్తూరు నగరానికి అతి సమీపంలోని గంగాసాగరం వద్ద గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వోల్వా ఏసి బస్సు టిప్పర్ను ఢీకొన్న ప్రమాదంలో సంఘటన స్థలంలో నలుగురు మతి చెందారు. మతి చెందిన వారిలో తిరుపతికి చెందిన శ్రీధర్, పున్ చంద్ర, తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారికి చెందిన జీవ, తంజావూరు ప్రశాంత్ గా గుర్తించారు. బస్సులో ప్రయాణిస్తున్న 22 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. తిరుపతి నుండి తమిళనాడు రాష్ట్రం మధురైకి బయలుదేరిన ఏసి బస్సు 8372 గంగాసాగరం ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకుంది. బస్సులోని ప్రయాణికులు అందరూ నిద్రావస్థలో ఉండగా ఒక్కసారిగా బస్సు ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొనడంతో బస్సు బోల్తా పడింది.రోడ్డు ప్రమాద సంఘటన సమాచారాన్ని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్, పోలీసు ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన వారిని వేలూరు సీఎంసి, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్ ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. టిప్పర్ డ్రైవర్ అతివేగంగా నడపడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు బస్సులోని ప్రయాణికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన తాలూకా పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.



వేగంగా వచ్చి వోల్వా బస్సును ఢీకొన్న టిప్పర్


మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలివ్వాలి : సిపిఎం

రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రైవేట్ ట్రావెల్స్ నిత్యం ప్రమాదాలకు గురవుతున్నాయని, వాహనాలను తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు.

ఎంఎల్ఎ గురజాల దిగ్భ్రాంతి

గంగసాగరం వద్ద ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందడం, 22 మంది గాయపడటంపై ఎంఎల్ఎ గురజాల జగన్మోహన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ ఆదేశాల మేరకు పిఎ కుమార్‌స్వామి యాదవ్, ఇతర సహాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని వైద్యులతో సమన్వయం చేశారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని చీలాపల్లి, రాణిపేట, వేలూరులోని సిఎంసి ఆస్పత్రులకు తరలించే ఏర్పాట్లు చేశారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి స్వస్థలాలైన తిరుపతి, కన్యాకుమారికి పంపించే ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే తండ్రి, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు చిత్తూరు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మతదేహాలను స్వస్థలాల పంపించే ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షించారు. మతుల కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

అంతరాలయ దర్శనాలకు అవాంతరాలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారుల నిర్లక్ష్యం ధోరణి, అవగాహన లోపానికి మరో నిదర్శనం అంతరాలయ దర్శనం టికెట్. స్వామి అమ్మవార్ల అంతరాలయంలోకి వెళ్లి దర్శనం చేసుకోవడానికి 500 రూపాయల టికెట్లు కొనుగోలు చేయాలని అధికారులు ఆదేశించారు. ఆధార్ కార్డు కలిగిన భక్తులకు మాత్రమే టికెట్లను విక్రయించారు. దీనివల్ల ఆలయ ఆదాయం పెరిగే అవకాశం ఉంది. దళారుల హవా కొంత మేరకు తగ్గనుంది. అయితే అంతరాలయ దర్శనం అమలులో ఎన్నో ఇబ్బందులున్నాయి. వీటిని అధికారులు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో మొదటి రోజే వివాదాలు మొదలయ్యాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి 500 రూపాయల టికెట్లు విక్రయాన్ని దేవస్థానం ప్రారంభించింది. మధ్యాహ్నంకు 50 మంది భక్తులు టికెట్లను కొనుగోలు చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. టికెట్టు కొనుగోలు చేసిన భక్తులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయలేదు. స్వామివారి ధ్వజస్తంభం నుంచి సర్వ దర్శనం క్యూలో వెళ్లి దర్శించుకోవలసి వచ్చింది. దీనిపై సిబ్బందికి కూడా పూర్తి సమాచారం లేదు. సంప్రదాయ దుస్తులతో వచ్చిన వారిని మాత్రమే అంతరాలయం లోకి పంపడం జరిగింది. అయితే స్థానికంగా ఉన్న ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు ప్రోటోకాల్ పేరుతో ప్రతిరోజు ఆలయానికి వస్తుంటారు. సంప్రదాయ దుస్తులతో వచ్చిన వారు అంతరాలయంలోకి వెళుతుంటారు. అయితే శుక్రవారం నుంచి విధించిన నిబంధన ప్రకారం స్థానిక ప్రముఖులు అంతరాలయంలోకి వెళ్లే అవకాశం లేదు. ఎవరైనా టికెట్ కొనుగోలు చేయాలనే నిబంధన పెట్టారు. ఈ విధానం కొంతవరకు సమంజసమే. అయితే వివిధ శాఖల అధికారులు, వారి బంధువర్గం, స్నేహితులు, నాయకులు అంతరాలయంలోకి వెళుతుంటే ఆపే అధికారం తాత్కాలిక సిబ్బందికి ఇబ్బందిగా తయారైంది. స్థానిక ప్రముఖులను నియంత్రణ చేయలేరు. ఆలయ ఇన్స్పెక్టర్లు, పర్యవేక్షకులు అందుబాటులో ఉండరు. దీంతో వివాదాలు వచ్చే ప్రమాదం ఉంది. శుక్రవారం పీఆర్వో కార్యాలయంలోని ఉద్యోగి కొందరిని స్వామి వారి దర్శనానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అంతరాలయంలోకి వెళ్లడానికి ప్రయత్నించారు. ఆలయ ఇన్స్పెక్టర్ అభ్యంతరం తెలిపారు. అయితే తనకు ఇఓ చెప్పారని ఆ ఉద్యోగి వివాదానికి దిగారు. టికెట్టు కొనుగోలు చేయకుండా, ఇఓ అనుమతి లేకుండా పంపేది లేదని ఆలయ ఇన్స్పెక్టర్ కూడా వాదన చేశారు. నాయకులు వచ్చిన సందర్భంగా వారి అనుచరులు కూడా అంతరాలయంలోకి వెళతారు. అందరూ తప్పనిసరిగా టికెట్లు కొనుగోలు చేయాలనే నిబంధన వల్ల గొడవలు జరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. దీనిపై ఇఓ బాపిరెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వాహనదారులు నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్లే అత్యధికశాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని శ్రీకాళహస్తి మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ దామోదర్ నాయుడు అన్నారు. శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలో గతేడాది మొత్తం 158 రోడ్డు ప్రమాదాలు జరగగా.. 75 మంది మతి చెందారనీ, 179 మంది గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో మతి చెందిన వారు ఎక్కువ భాగం ద్విచక్రవాహనదారులేననీ, హెల్మెట్లు ధరించకపోవడం, మద్యం తాగి వేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగినట్లు స్పష్టం చేశారు. స్థానిక ఎంవీఐ కార్యాలయంలో శుక్రవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎంవీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ లేకుండా నడపడం వల్ల, అతివేగంగా,నిర్లక్ష్యంగా వాహనాలు నడపకూడదన్నారు. కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని తెలియజేశారు. మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ అతివేగంగా వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎంవీఐ దామోదర్ నాయుడు



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ...

హెల్మెట్ మన రక్షణ కవచం

బుచ్చినాయుడు కండ్రిగ : హెల్మెట్ మన రక్షణ కవచమని మోటార్ వాహన తనిఖీ అధికారి దామోదర్‌నాయుడు తెలిపారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రాల్లో బ్యానర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా దామోదర్‌నాయుడు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాల్లో 40 శాతం ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల, వేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల జరిగాయన్నారు.

పుత్తూరు టౌన్‌లో... ఆర్టీవో ఆఫీసు వద్ద విద్యార్థులకు కరపత్రాలను పంచి భద్రత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, స్కౌట్ మాస్టర్ అశోక్, గైడ్స్ లీడర్ శైలజ, భూలోకేశ్వరి పాల్గొన్నారు.

4న శ్రీపద్మావతి అమ్మవారి రథసప్తమి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఫిబ్రవరి 4వ తేదీన రథసప్తమి పర్వదినం సందర్భంగా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు ఏడు ప్రధాన వాహనాలపై ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. సాయంత్రం 3.30 నుండి 4.30 గంటల వరకు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలోని శ్రీ కష్ణస్వామివారి ముఖ మండపంలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. అమ్మవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత కల్యాణోత్సవం, కుంకుమార్చన, బ్రేక్ దర్శనం, ఊంజల సేవలను టీటీడీ రద్దు చేసింది. శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయంలో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని జనవరి 28వ తేదీ ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు.

వైకుంఠ ద్వార దర్శన ఎస్-ఎస్‌డి టోకెన్లు పూర్తి : టిటిడి

ప్రజాశక్తి - తిరుమల


తిరుమల ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం జనవరి 19వ తేదీ చివరి రోజు కోసం జారీ చేసే సర్వదర్శనం టోకెన్ల జారీ శుక్రవారం (జనవరి 17)తో పూర్తి అయ్యింది. జనవరి 20న శ్రీవారి దర్శనం కోరే భక్తులు సర్వ దర్శనం క్యూ లైన్‌లో చేరుకుని మాత్రమే శ్రీవారి దర్శనం చేసుకోవాల్సి ఉంటుంది. జనవరి 19న వైకుంఠ ద్వార దర్శనం ముగియడంతో పాటు, ఆదివారం రానుండడంతో భక్తుల రద్దీ అధికం కానుండడంతో జనవరి 20వ తేదీన సర్వదర్శనం భక్తులు క్యూలైన్లు లోకి వెళ్లి స్వామివారిని దర్శించుకోవాలని టిటిడి విజ్ఞప్తి చేసింది. 19న ఆఫ్‌లైన్‌లో శ్రీ వాణి టిక్కెట్లు జారీ చేయబడవవని పేర్కొంది. 20న ప్రోటోకాల్ మినహా బ్రేక్ దర్శనాలు రద్దు చేసింది. ఇందువలన ముందు రోజు అనగా 19న విఐపి బ్రేక్ దర్శనం కోసం ఎటువంటి సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. భక్తులు టిటిడి సూచనల ప్రకారం తమ ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆర్జితసేవా టికెట్ల ఏప్రిల్‌నెల కోటాను శనివారం జనవరి 18న విడుదల చేయనున్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

భారత గణతంత్ర 76వ దినోత్సవ వేడుకలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఘనంగా నిర్వహించుటకు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్పీ మణికంఠ చందోలు, జెసి శుభం బన్సల్, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తదితర సంబంధిత అధికారులతో కలిసి ఈ నెల 26 న నిర్వహించనున్న 76 వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి అధికారులతో జూమ్ సమావేశము నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఈ నెల 26 న పోలీసు పెరేడ్ గ్రౌండ్ నందు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని పూర్తి పర్యవేక్షణ ఆర్డిఓ చేయాలని, గ్రౌండ్ నందు బందోబస్తు, జెండా వందనం, స్టేజ్ డెకరేషన్ ను, కవాతు ఏర్పాట్లను పోలీస్ శాఖ, సీటింగ్ ఏర్పాట్లను అర్బన్ తహశీల్దార్, విద్యార్థులచే సాంస్కతిక కార్యక్రమ నిర్వహణ డిఈఓ చూడాలని, ప్రథమ చికిత్స కేంద్రం, అత్యవసర వైద్య సేవల ఏర్పాట్లను డి ఎం అండ్ హెచ్ ఓ, పారిశుద్ధ్యం, త్రాగునీరు ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ అబివృద్ధి పథకాల పై స్టాల్స్, శకటాలను సంబంధిత శాఖలు ఏర్పాటు చేయాలన్నారు. డిఆర్ఓ నరసింహులు, కలెక్టరేట్ ఏవో భారతి పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో దళిత, గిరిజన సంఘాలు

శెట్టిపల్లి వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరపాలక సంస్థ పరిధిలోని శెట్టిపల్లిలో రోడ్లు, మురుగు కాలువలు నిర్మాణం, తాగునీటి సరఫరా వంటి మౌళిక వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్, తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం శెట్టిపల్లి, ఉప్పరపాలెం తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, రోడ్లు తదితరాలను ప్రజారోగ్య, ఇంజనీరింగ్, ప్లానింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. రోడ్లు సరిగా లేవని, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని, తాగునీరు నిర్దిష్ట సమయంలో వదలడం లేదని ప్రజలు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శెట్టిపల్లి, ఉప్పరపాలెంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు గుంతలు లేకుండా పూడ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ.రమణ, రెవెన్యూ ఆఫీసర్ రవి, ఏసిపి బాలాజి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి ఉన్నారు.



తాగునీటిని పరీక్ష చేస్తూ...

ప్రతి మూడో శనివారం 'స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్'


తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ ను విజయవంతం చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర - స్వచ్ దివస్ కార్యక్రమం నిర్వహణపై శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శనివారం ప్రత్యేకమైన పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2025 లోపు ఇంటింటి చెత్త సేకరణ 100 శాతం నిర్వహించేలా చేయడం, అక్టోబర్ 2025 లోపు చెత్తకుప్పలు లేకుండా చేయాలన్నదే ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. నూతన సంవత్సరంలో క్లీన్ స్టార్ట్ అనే థీమ్ మన ఇల్లు, మన ఆఫీసు, సచివాలయాలు, బస్టాండ్లు, పరిసరాల పరిశుభ్రత పాటించడం చేయాలని అన్నారు. మూడవ శనివారం ప్రకాశం పార్కులో పరిశుభ్రత పనులు చేసి, మానవహారం ఏర్పాటు చేస్తామని, శెట్టిపల్లి లో పెద్ద చెత్తకుప్పను తొలగించి చెట్లు నాటే కార్యక్రమం చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి ఉన్నారు.

చంద్రశేఖర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు పెట్టాలి

ప్రజాశక్తి - రేణిగుంట

మండలంలోని వెదళ్లచెరువు ఎస్టీ కాలనీలో జనవరి 7వ తేదీన క్రైస్తవ మందిరం కూల్చివేతకు కారకులు, గిరిజన తెగ మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టిన చంద్రశేఖర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్‌చేశారు. ఎపి గిరిజన సంఘం, కెవిపిఎస్, డికెఎంయు దళిత క్రైస్తవ సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రేణిగుంట బేతేలు ప్రార్థన మందిరం చర్చి వద్ద రౌండ్‌టేబుల్ సమావేశం ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగింది. నాయకులు జె.తులసిరాజన్, కొండ్రెడ్డి హరినాథ్, ప్సాస్టర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ వెదళ్లచెరువు ఎస్టీ కాలనీలో నాలుగేళ్లకు ముందు గిరిజన తెగకు చెందిన యానాదులు 15 కుటుంబాలు కలిసి సొంత ఖర్చులతో క్రైస్తవ ప్రార్థన మందిరాన్ని నిర్మించుకున్నారన్నారు. అయితే ఈ మందిరాన్ని ఈ నెల ఏడో తేదీన కూల్చివేసి, గిరిజనుల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టిన చంద్రశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు స్పందించని పక్షంలో క్రైస్తవ గిరిజన బాధితులకు అండగా నిలబడి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్టీకాలనీలో పాస్టర్ అశోక్ కొనుగోలు చేసిన ఇంటి స్థలాన్ని తిరిగి బాధితునికి ఇప్పించాలన్నారు. వెదళ్లచెరువు గ్రామంలోనే స్మశాన స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు.

ముగిసిన ఏటి పండుగ



ఏటి పండుగకు అయిన ఖర్చుల వివరాల బ్యానర్

ప్రజాశక్తి-నాయుడుపేట

మూడు రోజులపాటు లక్షల మంది ప్రజల ఆనందోత్సాహల నడుమ అట్టహాసంగా సాగిన ఏటి పండుగ కార్యక్రమం మూడోరోజు ఏడాది పండుగ సందర్భంగా ముగిసింది. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండగ సందర్భంగా మొదలయ్యే ఈ ఏటి పండుగ కార్యక్రమం వీక్షించేందుకు ఎక్కడెక్కడ నుంచో లక్షల కొలది ప్రజలు హాజరవుతుంటారు. ఈ కార్యక్రమాన్ని సజావుగా జరిపించడంలో మునిసిపాలిటీ వారిదే ప్రధాన పాత్ర అని చెప్పక తప్పదు. ఈ కార్యక్రమం కోసం స్వర్ణముఖి నదిని అందంగా తీర్చిదిద్దడం కోసం మునిసిపల్ శాఖ వారు ప్రణాళికాబద్ధంగా దాదాపుగా పది రోజులు పాటు శ్రమించి ప్రజలు తిరిగేందుకు ఆడుకునేందుకు అనుగుణంగా తయారుచేసి ఈ మూడు రోజులు పాటు లక్షలాది మంది ప్రజల రోజు వేసే చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ తిరిగి మరుసటి రోజు మధ్యాహ్నం కల్లా అందంగా ముస్తాబు చేస్తుంటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ కార్మికుల శ్రమ విశేషంగా తెలుపుకోదగ్గది. ఆపై ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా, ఎక్కడా ఆకతాయిల అల్లర్లకు తావివ్వకుండా పోలీస్ శాఖ వారు అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ మూడు రోజులపాటు ప్రజలకు ఎనలేని అనుభూతులు అందించటానికి నాయకులు రోజుకొక కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు అనేక అనుభూతులు అందిస్తారు. మొదటిరోజు ఎమ్మెల్యే నెలవలవిజయశ్రీ, నాయుడుపేట మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక ప్రసంగిస్తూ కార్యక్రమ వివరాలు తెలియజేశారు. అనంతరం నాయుడుపేట గొప్పతనాన్ని తెలియజేస్తూ నాయకుల ప్రసంగాలతో ప్రారంభించారు. రెండవ రోజు పాట కచ్చేరి డాన్స్ షోలు ఆకట్టుకున్నాయి. మూడవరోజు జబర్దస్త్ కమెడియన్లచే అనేక కార్యక్రమాలతో ప్రజలను అలరించారు. ఇలా మూడు రోజులపాటు అద్భుతంగా కొనసాగుతు చుట్టుపక్కల మండలాల ప్రజలను సైతం విశేషంగా ఆకట్టుకుంటుందనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. 25 లక్షల రూపాయల బడ్జెట్ తో చేపట్టిన ఈ కార్యక్రమ వివరాలు ఏటి పండుగ ప్రారంభించినప్పటి నుంచి ఇన్నేళ్లలో ఎప్పుడూ లేని విధంగా ప్రజలందరికీ తెలిసేలా కూటమి ప్రభుత్వ నాయకులు ఖర్చుల పట్టికను ఏర్పాటు చేయడం విశేషం.

'రియల్ మీ' బడ్స్ వైర్లెస్ 5 ఏఎన్‌సీ ఆవిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

'రియల్ మీ' అనేది భారత యువతలో పేరుగాంచిన స్మార్ట్ఫోన్ బ్రాండ్. వారి స్మార్ట్ఫోన్, ఏ ఐ ఓ టి పోర్ట్ఫోలియోను ఎక్కడా చూడని ఉత్పత్తులలో శుక్రవారం ప్రవేశపెట్టింది. అత్యంత మెరుగైన రియల్ మీ 14 ప్రో సిరీస్ 5 జి, రియల్ మీ బడ్స్ వైర్ లెస్ 5 ని అందిస్తుంది. రియల్ మీ 14 సిరీస్ 5 జి లో రియల్ మీ 14 ప్రో 5 జి, రియల్ మీ 14 ప్రో 5 జి అనే రెండు రకాలు అందుబాటులో ఉన్నాయి. రెండు ఫోన్‌లు ప్రఖ్యాత డానిష్ డిజైన్ స్టూడియో, వాలూర్ డిజైనర్‌ల సహకారంతో చాలా సూక్ష్మంగా రూపొందించబడ్డాయి. ఇది ప్రపంచంలోని మొట్టమొదటి చల్లని-సెన్సిటివ్ రంగు-మారుతున్న స్మార్ట్‌ఫోన్‌ల ప్రారంభానికి గుర్తుగా ఉంది. కొత్తగా పునరుద్ధరించబడిన రియల్‌మి నంబర్ సిరీస్ ప్రారంభ సమర్పణగా, రియల్‌మే 14 ప్రో సిరీస్ 5 మధ్య-శ్రేణి స్మార్ట్‌ఫోన్‌లలో ఫ్లాగ్‌షిప్ ఫీచర్‌లను ప్రాచుర్యం పొందడం, డిజైన్, ఇమేజింగ్, పనితీరులో విశేషమైన పురోగతులను సాధించడం లక్ష్యంగా పెట్టుకుంది.

చీకట్లో ఇక్కట్లు

ప్రజాశక్తి - చిల్లకూరు

చిల్లకూరు మండలంలోనిగ్రామాల్లో వీధిలైట్లు లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. విషపురుగులు వచ్చే అవకాశం ఉందనిగ్రామస్తులు భయపడుతున్నారు. పారి, చర్లపాలెం, తిక్కవరం, చింతవరం హరిజనవాడ అరుంధతి వాడా, వరగాలి హరిజనవాడ, పాలెం గ్రామంలో వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీవీధిలైట్లు వేయాలని కోరుతున్నారు.

కాపు సంఘం రాయలసీమ కన్వీనర్‌గా కలప రవి



యర్రావారిపాలెం : జాతీయ కాపు సంఘం రాయలసీమ జిల్లాల కన్వీనర్ గా కలప రవిని నియమిస్తూ కాపు సంఘం వ్యవస్థాపకులు కర్ణ మురళీకష్ణ నాయుడు ఉత్తర్వులు జారీ చేసినట్టు కలప రవి గురువారం మీడియాకు తెలియజేశారు. ఈ సందర్భంగా కలప రవి మాట్లాడుతూ కాపు సంఘం అభివద్ధికి శక్తి వంచన లేకుండా మరింత కషి చేస్తానని పేర్కొన్నారు.

కుట్టు మిషన్ వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు, ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బాలాజీ నగర్ లోని ప్రగతి సేవాసంస్థ కార్యాలయం నందు ఆర్ముగం 22వ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు రమేష్ బేకరీ అధినేత రమేష్ పూర్తి సహకారంతో ఒక మహిళకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఒక కుట్టు మెషిన్ ను అందించారు. అలానే 50 మంది నిరుపేద మహిళలకు చికెన్ బిర్యానీ , చీరలను ఇచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇందిరానగర్ కు చెందిన స్రవంతి అనే మహిళకు జీవనోపాధి కల్పించాలని ఉద్దేశంతో కుట్టుమిషన్ ను, పేదలకు దుస్తుల ను అందచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరీ కాటూరి శ్రీనివాసులు, ప్రగతి కుటుంబ సభ్యులు సుబ్బారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గోపి పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ డైరీ ఆవిష్కరణ

క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం ఇన్‌ఛార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు సమక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, జిల్లా కార్యదర్శి భగత్‌రవి, ఆఫీసు బేరర్స్ వినోద్, తేజ, బాల పాల్గొన్నారు. యూనివర్సిటీ సమస్యలపై దృష్టి సారించాలని, హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని నాయకులు కోరారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకుని వైద్యశిబిరం

పుత్తూరు టౌన్ : నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి పురస్కరించుకుని పుత్తూరు పట్టణం కార్వేటినగరం కూడలిలో చిత్రపటానికి నివాళి అర్పించనున్నారు. కెనరాబ్యాంకు ఎదురు ఎన్టీఆర్ ఫొటో ఎగ్జిబిషన్‌పెట్టి, ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు టిఎన్‌టియుసి అధ్యక్షులు రావిళ్ల మాధవనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎల్‌ఎ గాలి భానుప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. అన్నదానం నిర్వహించనున్నట్లు గాలి జీవరత్నం నాయుడు, ఎన్‌ఎన్ ధనపాల్ పేర్కొన్నారు.

కళాశాలపై దుష్ప్రచారం తగదు

ప్రజాశక్తి -కోట



కోట మండలంలోని ఎన్బికేఆర్ బోధనేతర సిబ్బంది సమస్యలపై కేసు న్యాయస్థానంలో ఉన్నందున తాము ప్రస్తుతానికి ఏమి చేయలేక పోతున్నామని ఎన్బికేఆర్ యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందినవారు, బోధనేతర సిబ్బందికి రావలసిన బకాయిలను యాజమాన్యం నిబంధనల ప్రకారం ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. తర్వాత కోర్టు తీర్పు అనంతరం నిబంధనలను అనుసరించి న్యాయం చేస్తామన్నారు. కళాశాలలో నిర్వహించే జనరల్ బాడీ సమావేశం ప్రకారం నిబంధనలను అనుసరిస్తామన్నారు. అంతేకాకుండా బోధనేతర సిబ్బంది తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. అదేవిధంగా కళాశాల ఖ్యాతిని భంగం కలిగించే విధంగా ప్రవర్తించకూడదని హితవు పలికారు.

'మ్యూజిక్ ఫెస్టివల్ ..రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్' ఆవిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సమకాలీన హిప్-హాప్ బీట్స్ తో బాలీవుడ్ లో ప్రసిద్ధి చెందిన శ్రావ్యమైన గీతాలను మిశ్రమం చేసిన మూడో ఎడిషన్ కోసం సీగ్రమ్ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మళ్లీ వచ్చింది. సంక్రాంతిని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో గ్లోబల్ బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ కార్తీక్ మహేంద్ర మాట్లాడుతూ మ్యూజిక్ విశ్వజనీయ భాషకు చిరునామాగా, యువతకు మ్యూజిక్ ను తమ కీలకమైన అభిరుచి మూలస్థంభంగా సంబరం చేసుకునేలా దీని రూపొందించామన్నారు. సీఈఓ అజయ్ గుప్త మాట్లాడుతూ 'రాయల్ స్టాగ్ నేటి యువత కోసం మ్యూజిక్‌ను ఒక కీలకమైన అభిరుచి అంశంగా ఎల్లప్పుడూ భావించింది. అందుకే ఇలాంటి వాటిని ముందుకు తీసుకొస్తున్నామన్నారు. మ్యూజిక్ డైరెక్టర్, సింగర్ అమిత్ త్రివేది, యతీష్ మెహ రిషి, పాటల రచయిత ఆర్మన్ మాలిక్, గాయని నిఖిత గాంధీ, కళాకారుడు రప్తార్ తదితరులు పాల్గొన్నారు.



సిఐటియు ఆధ్వర్యంలో గిరిజన సంబరాలు

ప్రజాశక్తి - ఓజిలి

సిఐటియు ఆధ్వర్యంలో ఈ ఏడాది పండగ సంబరాలను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని కుందాం గ్రామంలో శుక్రవారం గిరిజనులు కోలాటాలు, గొబ్బిల్లు గిరిజన ఆచారాలతో కోలాహలంగా నిర్వహించుకున్నారు. ఏడాది పండగకు హాజరైన సిఐటియు జిల్లా కార్యదర్శి శివకవి ముకుందా మాట్లాడుతూ కుందాం గ్రామంలో గిరిజనులు రోజువారి కూలి పనులకు పోతేనే పూట గడుస్తోందని వారికి ప్రభుత్వం ద్వారా ఎటువంటి సహాయ సహకారాలు అందజేయడం లేదని, కనీసం సాగు భూములు,పక్కా గహాలు లేక పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజనులకు ప్రభుత్వం పక్కా గహాలు నిర్మించి, సాగు చేసుకోవడానికి భూమి కల్పించినప్పుడే గిరిజనులకు అసలైన పండుగని తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో గిరిజనులు సంతోషంగా పండగ సంబరాలు జరుపుకున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు చంద్రకళ ,మధ్యాహ్నం భోజనం జిల్లా కార్యదర్శి కే విజయమ్మ , గిరిజన సంఘ నాయకులు టి మనీ, ఎం మణమ్మ, కే రమణమ్మ ,ఎం మనీషా , సిఐటియు నాయకులు జి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



బీసీ కాలనీలో గొబ్బెమ్మ పండుగ

బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలోని బీసీ కాలనీలో గొబ్బెమ్మ పండుగను మహిళలు ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు చంద్ర వర్ధన్, శివమణి, సందీప్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి ధనంజయలు హాజరయ్యారు. గొబ్బెమ్మను తడుతూ పాటలు పాడుతూ ఐక్యంగా పండుగను జరుపుకున్నారు. అనంతరం వందమంది పేదలకు అన్నదానం చేశారు. కోలాటం, డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి.

17 నుంచి తిరుపతిలో అంతర్జాతీయ దేవాలయాల సదస్సు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు తిరుపతి కేంద్రంగా అంతర్జాతీయ దేవాలయాల సదస్సు, ఎక్స్‌పో (ఐటీసీఎక్స్) నిర్వహించనున్నట్లు టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరేష్ కులకర్ణి తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 2023లో మొదటి సదస్సు నిర్వహించామని, రెండో సదస్సును ఫిబ్రవరి 17 నుండి 19 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయ నగరమైన తిరుపతిలో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. టెంపుల్ కనెక్ట్ (ఇండియా) ద్వారా అభివద్ధి చేయబడిన ఐటీసీఎక్స్, ప్రపంచవ్యాప్తంగా దేవాలయాల సమగ్ర నిర్వహణకు ప్రత్యేకంగా అంకితమైన ప్రపంచంలోని మొట్టమొదటి ప్రతిష్టాత్మక వేదికగా ఇది నిలుస్తుందన్నారు. ఇది ఆలయ ఆర్థిక వ్యవస్థ, పరిపాలన, కార్యకలాపాలు, పురోగతిలో శ్రేష్ఠతను సాధికారపరచడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ సంవత్సరం 1,580 కంటే ఎక్కువ దేవాలయాలు (1,200 మంది భౌతికంగా పాల్గొంటారు, దాదాపు 351 మంది ఆన్‌లైన్‌లో పాల్గొంటారు) మరియు హైబ్రిడ్ ఫార్మాట్‌లో 2,400 ప్రతినిధులు పాల్గొంటారున్నారు. ఈ సమావేశంలో రిజిస్టర్ కౌన్సిల్ చైర్మన్ ప్రసాద్ లాడ్ పాల్గొన్నారు.



ప్రాథమిక దశలో క్యాన్సర్ నివారణ సాధ్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తిగా నివారణ సాధ్యమవుతుందని నారాయణవనం వైద్యాధికారి డాక్టర్ రాగసుధ తెలిపారు. స్విమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణవనం పిహెచ్ సి పరిధిలోని తుంబూరు, పాలమంగళం గ్రామాల్లో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాగసుధ మాట్లాడుతూ పింక్ బస్సులో మహిళలు, పురుషులకు బిపి, షుగర్ పరీక్షలతోపాటు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మామోగ్రామ్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్టు చెప్పారు. జెడ్పీటీసీ కోనేటి సుమన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా జరుగుతున్న మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు మధుసూదన్ రెడ్డి, దివాకర్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ హరిత, డాక్టర్ చైతన్య భాను పాల్గొన్నారు.



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

గూడూరు టౌన్ : రాష్ట్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇప్పటివరకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా గూడూరు నియోజవర్గ ప్రజలకు 50 లక్షల రూపాయలకు పైగా ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు . గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 8 లక్షల రూపాయల సీఎం సహాయ నిధిని లబ్ధిదారులకు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అందజేశారు . వాకాడు మండలానికి చెందిన గౌతం తల సేమియా వ్యాధితో బాధపడుతూ ఉండడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి దేవి దష్టికి తీసుకు వెళ్లడంతో ఆమె చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఏడు లక్షల రూపాయలు గౌతమ్ కుటుంబానికి అందినందుకు భువనేశ్వరికి కతజ్ఞతలు తెలిపారు.

ప్రజాశక్తి - రామచంద్రాపురం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్రాంతికి పండుగకు స్వగ్రామమైన నారావారి పల్లికి వచ్చిన సందర్భంగా తనను పలు సమస్యలతో కలిసిన అర్జీదారులకు ఆపన్న హస్తం అందించి, చంద్రగిరి నియోజకవర్గంలో 11 మందికి 34.50 లక్షల సహాయ నిధి మంజూరు చేసి మానవత్వం చాటుకున్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 11 మందికి సుమారు రూ. 34.50 లక్షల ఆర్థిక సాయం చెక్కులను లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చేకూరి జనార్దన్ చౌదరి, కే నరసింహారెడ్డి, వి సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.

బీసీ బాలికల హాస్టల్‌కు రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - పిచ్చాటూరు

ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్‌కు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, ఇది 25 సంవత్సరాల కల అని ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం అన్నారు. సంక్రాంతి పండుగకు నారావారిపల్లికి విచ్చేసిన సిఎం దృష్టికి బిసి బాలికల హాస్టల్ రోడ్డు దుస్థితి గురించి వివరించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి స్వయంగా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఆదేశించడంతో రూ.13.5 లక్షలు నిధులు మంజూరు చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో అనేకమార్లు అడిగినా స్పందించలేదన్నారు. నియోజకవర్గంలోని బిసి సంక్షేమ హాస్టళ్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పక మరమ్మతులు చేయిస్తానని ఎంఎల్ఎ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ గీత, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇలంగోవన్ రెడ్డి, అరణీయార్ ఆయకట్టు చైర్మన్ రవి రెడ్డి, వాసు రెడ్డి, జై చంద్ర నాయుడు, అరుల్ ప్రకాష్, చిన్న, రవి, రజని, ఢిల్లీ, సుగంధ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ప్రెస్‌క్లబ్‌కు క్యారంబోర్డ్ వితరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి ప్రెస్ క్లబ్ సభ్యులలో క్రీడల పట్ల ప్రోత్సాహకాన్ని మరింత పెంచడానికి శాప్ చైర్మన్ రవినాయుడు జాతీయస్థాయి క్రీడల్లో వినియోగించే క్యారం బోర్డులను ప్రెస్ క్లబ్ కమిటీకి అందించారు. అనంతరం రవి నాయుడు మాట్లాడుతూ ఎల్లప్పుడు వార్తల సేకరణలో తల మునకలు అయ్యుండే జర్నలిస్టులకు క్రీడలతో కొంత మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే మీడియా స్పోర్ట్స్ కు సంబంధించి తగిన సహకారాన్ని అందిస్తానని రవి నాయుడు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రవినాయుడుని ప్రెస్ క్లబ్ కమిటీ సత్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మురళి, కార్యదర్శి బాలచంద్ర పాల్గొన్నారు.



ఎస్వీయూకు అంబులెన్స్ వితరణ

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 27 లక్షల విలువ కలిగిన అంబులెన్స్‌ను వితరణగా ఇచ్చారు. శుక్రవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్వీయూ శాఖ అధునాతన సౌకర్యాలతో ఉన్న అంబులెన్స్ ను ఎస్వీయు వర్సిటీ ఇంచార్జ్ ఉపకులపతి అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు చేతుల మీదగా వర్సిటీకి అందించింది. వర్సిటీలో ఉన్న అంబులెన్స్ పాతబడిపోవడంతో వర్సిటీ విసి, రిజిస్ట్రార్‌ల అభ్యర్థన మేరకు ఈ అత్యంత అధునాతనమైన అంబులెన్స్ ను యూనియన్ బ్యాంక్ అందించింది. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫీసర్లు, ఎస్వీయు ఫైనాన్స్ ఆఫీసర్ నగేష్ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -కోట

కోట మండలం స్థానిక ఎంపిడిఓ కాన్ఫరెన్స్ హాల్ లో సర్వసభ్య సమావేశం సాదాసీదాగా శుక్రవారం జరిగింది. ఈ సమావేశం స్థానిక ఎంపిడిఓ ఏకొల్లు వేణు అధ్యక్షతన నిర్వహించారు. మండల అభివృద్ధి వివరాలను సంబంధిత శాఖ అధికారులు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు దారా సురేష్, షేక్ షంషుద్దీన్, షేక్‌మొబీన్ భాష, పుట్టా నారాయణ పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి వెంకటగిరి సమస్యలు

ప్రజాశక్తి - వెంకటగిరి

నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ను వెంకటగిరి నియోజకవర్గ వైఎస్‌ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దష్టికి తీసుకెళ్లారు.

క్రైం న్యూస్

శ్రీకాళహస్తి కోర్టు సంచలన తీర్పు

హత్యకేసులో ముగ్గురికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - కెవిబిపురం

కెవిబిపురం మండలంలో ఎనిమిదేళ్ల క్రితం జరిగిన హత్య కేసుకు సంబంధించి శ్రీకాళహస్తి కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. హత్య కేసులో ముద్దాయిలు ముగ్గురికి జీవితఖైదు విధించింది.

మండలంలోని మఠం గ్రామానికి చెందిన పల్లమాల కుప్పయ్య మొదటి కుమారుడు పల్లమాల బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు... పల్లమాల కుప్పయ్యకు నలుగురు సంతానం. కుప్పయ్య ప్రతి ఆదివారం గ్రామంలో మటన్ వ్యాపారం చేస్తూ వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. అయితే 2017, డిసెంబర్ 30న రాత్రి 7.30 గంటలకు తన తండ్రికి ఫోన్ రాగా బయటకు వెళ్లాడు. మరుసటి దినం గ్రామస్తుడు పర్వతాల రమేష్ కేకలు వేయడంతో వెళ్లి చూడగా నాగూర్‌రెడ్డి బీడు భూముల్లో తండ్రి రక్తగాయాలతో చనిపోయి ఉన్నాడు. కెవిబిపురం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మృతుని రెండో కోడల్ని ఎ1 ముద్దాయి ఎన్.గంగరాజు అసభ్యంగా ప్రవర్తించడంతో మానుకోవాలని పలుమార్లు పి.కుప్పయ్య మందలించాడు. దీన్ని మనస్సులో పెట్టుకుని అతని అడ్డు తొలగించుకోవాలని కుప్పయ్యకు ఫోన్ చేసి పిలిపించుకుని ఎ2 బి.రాజా, ఎ3 లోకేష్ కలిసి కత్తితో నరికి బీడు భూముల్లో వేసి పరారయ్యారు. సిఐ ముద్దాయిలపై ఛార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు.



ద్విచక్ర వాహనాల చోరుడు అరెస్ట్

15 లక్షల విలువైన వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ద్విచక్ర వాహనాల దొంగను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 15 లక్షలు విలువ గల 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి డిఎస్పి వెంకట్ నారాయణ తెలిపారు. వెస్ట్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ ఎస్ వి మెడికల్ కళాశాల సమీపంలోని వివేకానంద సర్కిల్ వద్ద పోలీసులు శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా సత్యసాయి జిల్లా కదిరి మండలం కాలసముద్రం చెందిన పటాన్ సాహిద్ అనుమానాస్పదంగా పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసుల విచారణలో అతని ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడిన పాత నేరస్థుడుగా గుర్తించారు. ద్విచక్ర వాహనాల చోరీల్లో సంబంధం ఉన్న మరో ఇద్దరు పఠాన్ ఇమ్రాన్, మహేంద్ర నాయకులను అరెస్టు చేయాల్సి ఉండగా, మహేంద్ర నాయక్ గత నెల రోడ్డు ప్రమాదంలో మతి చెందాడు. పటాన్ ఇమ్రాన్ ను త్వరలో అదుపులో తీసుకుంటామని డిఎస్పి వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితున్ని రిమాండ్ కు తరలించినట్లు వెల్లడించారు. నిందితుడు అరెస్టు, సొత్తు స్వాధీనాలను సహకరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు.

పోలీసు స్టేషన్‌లో డిఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్ స్టేషన్లో డిఎస్‌పి నరసింహమూర్తి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాత కేసులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవంగా విచారించి వారి సమస్యను అడిగి తెలుసుకోవాలని ఎస్‌ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. గంజాయి, అక్రమ మద్యం తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గుబ్బిదేవుళ్ల ఊరేగింపు శుక్రవారం జరుగుతుందని, సిబ్బందిపహారా నిర్వహించి ప్రజలకు సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు.

కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు

బిఎన్ కండ్రిగ : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉదయం కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని డాక్టర్ దివాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం జనవరి 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు జరుగుతుందన్నారు. ఆశా కార్యకర్త, మగ వాలంటీరు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ నిశితంగా పరిశీలించి గుర్తించాలన్నారు. వైద్యాధికారి నిర్ధారిస్తే ఉచితంగా మందులు ఇచ్చి జబ్బు నయం చేయడమే గాకుండా, అంగవైకల్యం రాకుండా కాపాడతామన్నారు. మచ్చలు నిర్లక్ష్యం చేస్తే అంగవైకల్యులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విద్యాసాగర్, ఆరోగ్యాధికారి డిఎన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏ బి సి వర్గీకరణకు వ్యతిరేకం : చింతామోహన్

ప్రజాశక్తి - గూడూరు టౌన్



ఏ బీ సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, అనేక రాష్ట్రాలు ఏబీసీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయని కాంగ్రెస్ తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా అంటరానితనం ఎక్కువగా ఉన్నదని, కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత అన్ని వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించిందని గుర్తు చేశారు. ఇటీవల కోర్టు ఏ బి సి వర్గీకరణ పై తీర్పు ఇచ్చిందని, అనేక రాష్ట్రాలు దీని పట్టించుకోలేదని, అయితే మన రాష్ట్రం ఏకసభ్య కమిషన్ వేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని వెల్లడించారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రామ కష్ణ పాల్గొన్నారు.